సాక్షి అనకాపల్లి

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



నర్సుల నిరసన

మహారాణిపేట (విశాఖ): తమను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ నర్సులు నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు.



దివ్యాంగుల పారా షూటింగ్

మహారాణిపేట (విశాఖ): వైఎంసీఏ బీచ్ రోడ్డులో ఈ నెల 29 తేదీన రాష్ట్ర స్థాయి పారా షూటింగ్ పోటీలు ప్రారంభం కానున్నాయి.

వాతావరణం

అనకాపల్లి: రాగల నాలుగు రోజులు వాతావరణం మేఘావృతమై అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం చెప్పారు. ఈనెల 14న 1 మి.మీ, 15న 2, 16న 1, 17న 1, 18న 3 మి.మీ చొప్పున వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

గణనాథుడికి వెండి ఆభరణాల అలంకరణ



అనకాపల్లి: మండలంలో గోపాలపురం పంచాయతీ వెంకటరమణపేటలో ఇటీవల నిర్మించిన వినాయక ఆలయంలో స్వామికి శుక్రవారం వెండి ఆభరణాలు అలంకరించారు. స్వామి కిరీటం, రెండు చెవులు, తొండం, దంతాలకు, బొట్టుకు భక్తుల సహాయంతో 300 తులాల వెండితో ఆభరణాలు తయారు చేయించారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన పి.సత్యనారాయణ, అనురాధ దంపతులు స్వామివారి కిరీటం తయారీకి 30 తులాల వెండిని సమర్పించినట్టు ఆలయ నిర్వాహకులు జెర్రిపోతుల నాగఅప్పారావు, పద్మజ దంపతులు తెలిపారు. భక్తుల సహాయంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

ఏయూను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



ఏయూ వీసీ శశిభూషణరావుతో భేటీ అయిన హైకోర్టు న్యాయమూర్తి వెంకటజ్యోతిర్మయి

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటజ్యోతిర్మయి సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో కేజీహెచ్‌కు వైద్య పరికరాలు



కేజీహెచ్, హెచ్‌పీసీఎల్ మధ్య ఎంఓయూ పత్రాలను చూపిస్తున్న విశాఖ కలెక్టర్

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో బర్న్స్ వార్డుకు పలు ఆధునాతన వైద్య పరికరాలు ఇవ్వడానికి హెచ్‌పీసీఎల్ సంసిద్ధత వ్యక్తం చేసింది. రూ.1.20 కోట్లతో పలు వైద్య పరికరాలు ఇచ్చేందుకు శుక్రవారం హెచ్‌పీసీఎల్, కేజీహెచ్ ఒప్పందం కుదుర్చుకుంది. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సమక్షంలో జరిగిన ఎంఓయూలో ఇరువురూ సంతకాలు చేశారు. కేజీహెచ్ తరపున సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, హెచ్‌పీసీఎల్ తరపున సీజీఎం-హెచ్ఆర్ జి.కిరణ్‌కుమార్, ఈడీ-వీఆర్ ఆర్.రామకృష్ణన్‌లు సంతకాలు చేశారు. హెచ్‌పీసీఎల్ పీఆర్వో ఎం.కాశీ పాల్గొన్నారు.

సీఎస్సార్ నిధులతో దోమతెరలు



విరాళంగా ఫార్మా కంపెనీలు అందించిన దోమతెరలను గిరిజనులకు తరలిస్తున్న డీఆర్వో దయానిధి, సీపీవో రామారావు, పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్

తుమ్మపాల : ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా జిల్లాలో ఉచితంగా దోమతెరలు పంపిణీకి చర్యలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టర్ పిలుపు మేరకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) నిధుల్లో భాగంగా మెస్సర్స్ టయోస్సు రేర్ ఎర్త్స్(అచ్యుతాపురం) 10 వేలు, అరబిందో లేబరేటరీస్ ఫార్మాసిటీ, (పరవాడ) 2,500 దోమతెరలను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. జిల్లాలో 30 వేల దోమతెరల పంపిణీకి వివిధ పరిశ్రమల యాజమాన్యాలను కోరడంతో వారంతా సహృదయంతో అందించారని కలెక్టర్ చెప్పారు. గత వారంలో 10 వేల దోమ తెరలను బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థులకు, గిరిజన మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు పంపిణీ చేశామన్నారు. ఆయా కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు మురళీధరరావు, రామకృష్ణ అందించిన దోమతెరలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. త్వరలో మరిన్ని దోమతెరలు పంపిణీ చేయడానికి చర్యలు చేపడతామన్నారు. డీఆర్వో దయానిధి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రామారావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

మా అమ్మాయి భవిష్యత్తు ఏమిటో?



మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే తెలివైన మధ్యతరగతి, దిగువ తరగతి పిల్లలు వైద్యులు కావడం కష్టమే. ఎంతోమంది పేద పిల్లలు డాక్టర్ కావాలన్న ఆశతో కష్టపడి చదువుకుంటున్నారు. ప్రభుత్వం తీసుకున్న కొత్త నిర్ణయంతో వారి ఆశలన్నీ అడియాసలు అయినట్లే. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని తలపెట్టారు. దీనిని కొనసాగిస్తే ఆయనకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని కూటమి ప్రభుత్వం ఈవిధంగా కుట్ర చేయడం దారుణం. మా పాప ఈ ఏడాది నీట్ పరీక్షలు రాసింది. ప్రభుత్వ రాజకీయ నిర్ణయాలతో ఆమె భవిష్యత్తు ఏమవుతుందోనని బెంగగా ఉంది.

– మైనం శ్రీనాగగోపి, చమ్మచింత, నాతవరం మండలం



నాతవరం/దేవరాపల్లి:

అవరోధాలు సృష్టించడం అన్యాయం



వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసేలా ప్రభుత్వం వ్యవహరించడం అత్యంత దారుణం. కొత్తగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటైతే మాలాంటి నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆశపడ్డాం. కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేసి సీట్లు పెంచాల్సిన ప్రభుత్వం అవరోధాలు సృష్టించడం అన్యాయం. ఈ ఏడాది సీట్లు పెరుగుతాయని ఎంతోమంది నిరుపేద విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు. వారి కలలను ప్రభుత్వం నీరు గార్చింది. సర్కారు తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల మాలాంటి పేద పిల్లల భవిష్యత్తు గందరగోళంగా మారుతుంది.

–నలాది షర్మిల, బైపీసీ, ద్వితీయ సంవత్సరం విద్యార్థి, తెనుగుపూడి గ్రామం, దేవరాపల్లి మండలం

పుడమికి జీవం.. పైరుకు ప్రాణం



నేల సారాన్ని పెంచడానికి, మొక్కలకు పోషకాలు అందించడానికి జీవన ఎరువులు ప్రధానం.. వీటితో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ.. రైతులకు పెట్టుబడులు భారం లేకుండా అధిక దిగుబడి పొందవచ్చు. అటువంటి జీవన ఎరువుల వినియోగాన్ని రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్) కసరత్తు మొదలు పెట్టింది. ప్రకృతికి, పైరుకి చేకూరే ప్రయోజనాలను వివరిస్తూ రైతుల్లో ఇప్పటికే చైతన్యం తీసుకొస్తుంది. మరో వైపు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



- ఆర్ఏఆర్ఎస్‌లో జీవన ఎరువుల తయారీ కేంద్రాల ఏర్పాటు
- ఎరువుల్లో నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్ లభ్యం
- జీవన ఎరువులతో 10–15 శాతం వరకు పెరుగుతున్న దిగుబడి
- రసాయన ఎరువుల వాడకాన్ని 25 శాతం వరకు తగ్గింపు



జీవన ఎరువులు



సాక్షి, అనకాపల్లి: రైతులు జీవన ఎరువుల వినియోగం పెంచేలా ఆర్ఏఆర్ఎస్ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పరిశోధన స్థానంలో పొడి, ద్రవ రూప జీవన ఎరువుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తక్కువ ధరలో నేలకు ప్రాణం పోసే జీవన ఎరువులను అన్ని రకాల పంటలకు వినియోగించవచ్చు.

ఇటీవల రసాయనిక ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిన కారణంగా రైతుకు పెట్టుబడులు పెనుభారంగా మారాయి. రసాయనిక ఎరువుల పైనే ఆధారపడి వ్యవసాయం చేసే రైతులకు జీవన ఎరువులతో అధిక దిగుబడి ఎలా సాధ్యమవుతుందో వివరించి, అందుబాటులోకి తీసుకురావాలనే ధృడ సంకల్పంతో ఆర్ఏఆర్ఎస్ సన్నాహాలు చేస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులందరికీ ఈ ఎరువులు పంపిణీ చేపడితే మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

వాతావరణ కాలుష్య నివారణకు దోహదం

జీవన ఎరువుల వినియోగం వాతావరణ కాలుష్య నివారణకు దోహదపడుతోంది. మరోవైపు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడం వల్ల పెట్టుబడి ఆదా అవుతుంది. నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధ్యమవుతాయి. పైరుకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్ పుష్కలంగా లభిస్తాయి. వాతావరణంలో చాలా మొత్తంలో (సుమారు 78 శాతం) నత్రజని ఉంటుంది. వాటిని మొక్కలు గ్రహించలేని స్థితిలో ఉంటాయి. జీవన ఎరువుల వినియోగం వల్ల మొక్కకు తగిన నత్రజని, నేల నుంచి మొక్క తీసుకోలేని భాస్వరం, పొటాషియం కూడా జీవన ఎరువుల వల్ల అందుతాయి. జీవన ఎరువుల్లో నత్రజని స్థిరీకరించేవి(నైట్రోజన్ ఫిక్సింగ్ బాక్టీరియా), భాస్వరం అందించేవి(పాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బాక్టీరియా), పొటాషియం అందించేవి(పొటాషియం మొబిలైజింగ్ బ్యాక్టీరియా), జింక్ అందించే (జింక్ సాల్యుబులైజింగ్ బాక్టీరియా) జీవన ఎరువులు ఉంటాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జీవన ఎరువుల ఉపయోగాలు

- పంట దిగుబడులు 10–15 శాతం వరకు పెరుగుతాయి.
- రసాయన ఎరువుల వాడకాన్ని 20–25 శాతం వరకు తగ్గించుకోవచ్చు.
- వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చు.
- నేల భౌతిక లక్షణాలు మెరుగుబడి భూసారం పెరుగుతుంది.
- తక్కువ ధరల్లో లభ్యం
- సూక్ష్మధాతు పోషక లోపాలు రాకుండా నివారణ
- హార్మోన్లు, విటమిన్లు మొక్కలకు లభ్యమై ఆరోగ్యంగా పెరుగుదలకు అవకాశం
- నేల గుల్లబారి వేర్లు బాగా లోపలికి చొచ్చుకుపోయి పోషకాలు ఎక్కువగా గ్రహింపు
- నేల నుంచి సంక్రమించే తెగుళ్లను కొంత మేరకు అరికట్టవచ్చు. ఈ జీవన ఎరువులు అన్ని పంటలకు వాడుకోవచ్చు. జీవన ఎరువులతో తప్పనిసరిగా సేంద్రియ ఎరువును వాడాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- **జీవన ఎరువులను రసాయన ఎరువులలో కలిపి వాడకూడదు.**
- **ఎండ తగలని చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి.**
- **నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి.**
- జీవన ఎరువుల ప్యాకెట్‌పై ఉన్న గడువులోపే వాడాలి.
- నాణ్యత గల కల్చర్‌ను మాత్రమే వినియోగించాలి.
- రసాయనాలతో విత్తన శుద్ధి చేసుకునేటప్పుడు విధిగా 24–28 గంటల వ్యవధి ఉండాలి.
- నాణ్యత కలిగిన జీవన ఎరువులను ప్రభుత్వరంగ సంస్థలు లేదా నమ్మకమైన ప్రైవేటు సంస్థల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి.

రైతుకు లాభసాటి



జీవన ఎరువులు వాడకంతో రైతుకు లాభసాటిగా ఉంటుంది. రైతు ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పిస్తున్నాం. ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేస్తాం. దీంతో ప్రతి రైతుకు జీవన ఎరువులపై అవగాహన వస్తుంది. దీనిపై జిల్లా అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తాం. రైతుకు పెట్టుబడి భారం ఉండకూడదనే ఆర్ఏఆర్ఎస్ జీవన ఎరువుల తయారీపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది.

– డాక్టర్ ముకుందరావు, ఏడీ, ఆర్ఏఆర్ఎస్

ఫార్మా క్షతగాత్రుడికి వైఎస్సార్‌సీపీ సాయం

- లక్ష చెక్కు అందజేసిన పార్టీ సమన్వయకర్త మలసాల



గంగాధర్‌కు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి: ఎసెన్షియా ఫార్మా కంపెనీలో గత నెల 21న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన తామరాన గంగాధర్‌కు వైఎస్సార్‌సీపీ రూ.లక్ష ఆర్థిక సాయం అందించింది. శుక్రవారం రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆయనకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రమాదంలో గాయపడి ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే పరామర్శించారని, బాధితులను ఆదుకుంటామని ఆ సందర్భంగా హామీ ఇచ్చారని చెప్పారు. అన్న మాట ప్రకారం రూ.లక్ష చెక్కు పంపించారని, సామాన్య ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా నిలబడుతుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

అనకాపల్లి: ఏపీ ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ అడ్మిషన్ల కోసం ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవచ్చన్నారు. 15 సంవత్సరాలు పైబడిన వ్యక్తులు పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు www. apopenschool. ap. gov. in వెబ్‌సైట్‌లో చూడాలని ఆమె కోరారు.

జీవీఎంసీలో కమీషన్లు షురూ!

- పర్సంటేజీలు ఫిక్స్...
- 8 శాతం ఇవ్వాలని కాంట్రాక్టర్లకు హుకుం
- కమీషన్లు ఇవ్వని పనులకు నో క్లియరెన్స్
- 'స్థాయీ' సభ్యులకు సంబంధం లేకుండా చక్రం తిప్పుతున్న ఓ నేత
- సదరు నేత జోక్యంపై అధికారపార్టీ స్థాయీ సంఘ సభ్యుల మండిపాటు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అధికార పార్టీ నేతలు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో కమీషన్లు షురూ చేశారు. స్థాయీ సంఘం ఎన్నికల్లో గెలిచిన తర్వాత జరిగిన మొదటి సమావేశంలోనే కమీషన్ల పంట పండించుకునేందుకు సిద్ధమయ్యారు. 8 శాతం కమీషన్ ఇవ్వాలంటూ కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. తాము చెప్పిన విధంగా కమీషన్ ఇచ్చిన పనులకు క్లియరెన్స్ ఇచ్చిన స్థాయీ సంఘం సభ్యులు.. పర్సంటేజీలు దక్కని పనులను పక్కన పెట్టినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారమంతా స్థాయీ సంఘంతో సంబంధం లేకుండా.. మేయర్ పీఠం కోసం ఆశపడుతున్న అధికారపార్టీ నేత చక్కబెడుతున్నట్టు తెలుస్తోంది. అయితే నేరుగా తాను రంగంలోకి దిగకుండా తన అనుచరుడిని దించి వ్యవహారాలు నడుపుతున్నట్టు సమాచారం. అనధికారికంగా సదరు నేత పెత్తనంపై అధికారపార్టీలోని స్థాయీ సంఘం సభ్యులు కూడా మండిపడుతున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా మొదటి స్థాయీ సంఘం సమావేశంలోనే ఆవురావురుమంటూ కాంట్రాక్టర్ల వద్ద పర్సంటేజీలు పిండుకునేందుకు అధికారపార్టీ నేతల వ్యవహారం జీవీఎంసీలో చర్చనీయాంశంగా మారింది.

లెస్‌కు వేసినా...

జీవీఎంసీ పరిధిలో పనులన్నీ టెండర్ల ద్వారానే కట్టబెడుతుంటారు. స్థాయీ సంఘంలో చర్చకు వచ్చిన 280 అంశాల్లోని పనులన్నింటినీ టెండర్ల ద్వారా కట్టబెట్టాలి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ పనులను నామినేషన్ కింద అప్పగించారు. నామినేషన్ మీద అప్పగించిన పనులను తక్కువ పర్సంటేజీకే దక్కించుకున్న కాంట్రాక్టర్లు... 8 శాతం కమీషన్ దెబ్బకు తాలెత్తిపోతున్నారు. ఇప్పటికే టెండర్ ధర కంటే తక్కువ ధర కోట్ చేసి దక్కించుకున్న పనులకు ఇంత పెద్ద మొత్తంలో పర్సంటేజీలు ఇస్తే... తమకు గిట్టుబాటుకాదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. దీంతో పాటు బిల్లుల కోసం ఇంజినీర్లకు, అకౌంట్ సెక్షన్‌కు ఇచ్చే పర్సంటేజీలన్నీ కలిపితే 15 శాతం వరకూ చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడుగా తక్కువ ధరకు కోట్ చేసిన మొత్తం కూడా తీసివేస్తే... ఇక తమకు ఏమీ మిగిలే అవకాశం లేదని వాపోతున్నారు. ఈ పర్సంటేజీల వ్యవహారంలో అసలు స్థాయీ సంఘంతో సంబంధం లేని వ్యక్తి నిర్ణయాలు తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మేయర్ తానేనంటూ...!

స్థాయీ సంఘంతో ఏ మాత్రం సంబంధం లేని అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ ఈ వ్యవహారాలన్నింటినీ చక్కదిద్దేందుకు రంగంలోకి దిగారు. ఏయే అంశాలు చర్చించాలి? ఏయే అంశాలు వద్దు అనే వివరాలన్నీ ఆయన డైరెక్షన్‌లోనే నడుస్తున్నాయి. అధికారులతో సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. దీనిపై 'సాక్షి' కథనాలు ప్రచురించడంతో వెనక్కి తగ్గారు. నేరుగా ఆయన ప్రమేయం లేకుండా... తన అనుచరులను రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. ఆయన అనుచరులు స్థాయీ సంఘం సమావేశంపై పెత్తనం చేయడమేమిటని అధికారపార్టీ సభ్యులే మండిపడుతున్నారు. వాస్తవానికి అధికారపార్టీకి మెజార్టీ వచ్చింది.. మార్చిలో పెట్టబోయే అవిశ్వాస తీర్మానంలో తాను మేయర్ అవుతానంటూ సదరు నేత ఇప్పటికే జీవీఎంసీలో ప్రచారం చేసుకుంటున్నాడు. ఇందుకోసం తాను చేసిన ఖర్చులను వసూలు చేసేందుకే పర్సంటేజీలను మాట్లాడుకుంటున్నానంటూ ఆయన చెప్పుకుంటున్నారు. దీనిపై స్థాయీ సంఘంలోని కొందరు సభ్యులు అధికార తెలుగుదేశం పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్టు కూడా తెలుస్తోంది. మొత్తంగా పర్సంటేజీల వ్యవహారం ఇప్పుడు జీవీఎంసీలో, అధికారపార్టీలో చిచ్చురేపుతోంది.

అధికారులు లేక పలు అంశాలు వాయిదా



స్థాయీ సంఘ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్న సభ్యులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం దాదాపు ఏడు నెలల తర్వాత శుక్రవారం జరిగింది. స్థాయీ సంఘ నూతన సభ్యుల ఎన్నిక తర్వాత తొలిసారిగా నిర్వహించిన ఈ సమావేశం అజెండాలో 280 అంశాలు పొందుపరిచారు. ఇందులో 150 అంశాలు మాత్రమే చర్చించగా.. దాదాపు 50 అంశాలు వాయిదా పడ్డాయి. సమయం లేకపోవడంతో మిగిలిన అంశాలకు సంబంధించి ఈ నెల 17న సమావేశం కావాలని నిర్ణయించారు.

స్థాయీ సంఘ సమావేశం జరిగిందిలా..

ఉదయం 10.37 గంటలకు జీవీఎంసీ సెక్రటరీ ఫణిరామ్ నియమ నిబంధనలు వివరించిన అనంతరం మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి చర్చ ప్రారంభించారు. సాయంత్రం 5 గంటల వరకు సాగిన చర్చలో 150 అంశాలు చర్చించి, ఇందులో పలు అంశాలు వాయిదా వేశారు. జీవీఎంసీ అన్ని జోన్లకు సంబంధించి పలు అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు వచ్చాయి. వివరణ ఇచ్చే అధికారులు వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొనేందుకు విజయవాడ వెళ్లిపోవడంతో.. కింది స్థాయి అధికారులు సరైన వివరణ ఇవ్వలేకపోయారు. దీంతో పలు అంశాలు వాయిదా పడ్డాయి. స్థానిక కార్పొరేటర్లకు తెలియకుండా స్థాయీ సభ్యుల ఆమోదానికి వచ్చే అంశాలను కూడా సభ్యులు వాయిదా వేశారు. స్థానిక కార్పొరేటర్ల అనుమతి తీసుకువస్తే.. వచ్చే సమావేశంలో ఆమోదిద్దామని చైర్‌పర్సన్‌కు తెలిపారు. స్థాయీ సంఘ సమావేశం నియమ నిబంధనలు కొత్త సభ్యులు తెలుసుకోవాలని చైర్‌పర్సన చెప్పారు.

పల్స్‌పోలియో ఖర్చులు మనకెందుకు?

పల్స్‌పోలియోలో భాగంగా ఏఎన్ఎం, ఇతర వైద్య సిబ్బందికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన అంశాన్ని సంబంధించి సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. దీనికి చైర్‌పర్సన్ స్పందిస్తూ.. 'మీరు ఈ అంశాన్ని పూర్తిగా చదివారా? పల్స్‌పోలియో అనేది జీవీఎంసీకి సంబంధించింది కాదు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖది. వైద్య సిబ్బంది టిఫిన్, భోజన ఖర్చులు జీవీఎంసీ ఎందుకు భరించాలి?' అంటూ సభ్యులను ప్రశ్నించారు. దీంతో సభ్యులు కంగుతిన్నారు. మనమెందుకు ఈ ఖర్చులు భరించాలో తెలపాలని అధికారుల వివరణ కోరారు. స్థాయీ సంఘ సభ్యులతో పాటు అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మీ, హేమావతి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

16 నుంచి సీపీఎం రక్షణ యాత్ర

అనకాపల్లి: జిల్లాలో ఫార్మా కంపెనీల్లో కార్మికులకు కనీస భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14 నుంచి నిర్వహించాలని తలపెట్టిన సీపీఎం రక్షణ యాత్రను 16వ తేదీకి వాయిదా వేశామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణించిన కారణంగా రక్షణ యాత్రను వాయిదా వేశామని చెప్పారు. ఈనెల 16న పాయకరావుపేటలో ప్రారంభమై నక్కపల్లి, ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి, మునగపాక, అనకాపల్లి, పరవాడల మీదుగా అచ్యుతాపురం మండలానికి ఈనెల 20న చేరుతుందని, అక్కడ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రత, ప్రభుత్వాలు తీసుకోవలసిన పటిష్ట చర్యలపై రక్షణ యాత్ర ద్వారా ఉద్యమిస్తున్నామన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో పవిత్రోత్సవాలు

డాబాగార్డెన్స్ (విశాఖ): ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి విశేష పూజాధికాలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, మృత్సంగ్రహణం, అంకురారోపణ, నీరాజన మంత్ర పుష్పం జరిపారు. ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

శారద మాతకు గంగా హారతి



శారదా నది ఒడ్డున ఉమాసమేత రామలింగేశ్వర దేవస్థానం సమీపంలో శుక్రవారం రాత్రి శారద మాతకు ఆలయ ప్రధాన అర్చకులు సాలగ్రామం రఘు గంగా హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది వినాయక నవరాత్రుల్లో శారద మాతకు గంగా హారతి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. - అనకాపల్లి

క్లుప్తంగా

వరద బాధితులకు రూ.60 లక్షల విరాళం



సీఎం చంద్రబాబుకు వరద బాధితుల సహాయార్థం చెక్కు అందిస్తున్న డెక్కన్ యాజమాన్యం

పాయకరావుపేట: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి పాయకరావుపేట నియోజకవర్గంలో ఉన్న డెక్కన్ ఫైన్ కెమికల్స్ యాజమాన్యం రూ.60 లక్షల ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ మేరకు చెక్కును హోంమంత్రి వంగలపూడి అనిత సమక్షంలో యాజమాన్యం తరఫున డైరెక్టర్ కె.వి.ఎల్.పి. రాజు, ఉపాధ్యక్షుడు ఎ.ఎస్.వీరారెడ్డిలు కలిసి విజయవాడ సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సహాయ నిధికి రూ.10 లక్షలు, సీఎం సహాయ నిధికి రూ.50 లక్షలు అందించినట్లు తెలిపారు.

కుంకుమ అలంకరణలో విఘ్నేశ్వరస్వామి



చోడవరం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు శుక్రవారం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొండమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో విశాఖపట్నానికి చెందిన నిర్మల జ్యోతి నృత్య నికేతన్ చిన్నారులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. డాక్టర్ విజయజ్యోతి పర్యవేక్షణలో మహిళల బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించింది.

17న ఎమ్మెస్సీ అప్లైడ్ కెమిస్ట్రీ పరీక్ష

విశాఖ సిటీ: వర్షాలు కారణంగా వాయిదా వేసిన ఎమ్మెస్సీ అప్లైడ్ కెమిస్ట్రీ సెమిస్టర్–2 ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఏయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ పరీక్ష ఈ నెల 9వ తేదీన జరగాల్సి ఉన్నప్పటికీ ఆ సమయంలో భారీ వర్షాలు కారణంగా పరీక్ష వాయిదా వేసినట్లు చెప్పారు. తాజాగా ఈ నెల 17న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. అలాగే దీంతో పాటు యోగాలో పీజీ డిప్లమో సెమిస్టర్–2 చివరి పరీక్ష కూడా 17వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతుందని వివరించారు.

వైద్య విద్యకు దూరమవుతారు



వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయొద్దు. ప్రభుత్వ అధీనంలోనే నిర్వహించాలి. ప్రైవేటు పరం చేస్తే వైద్య విద్య సామాన్య విద్యార్థులకు అందని ద్రాక్షగా మారుతుంది. ఎక్కువ డొనేషన్లు చెల్లించే స్థోమత లేనివారు వైద్య విద్యకు దూరమవుతారు. అలాగే ప్రభుత్వ వైద్య కళాశాలలో అందించే సూపర్ స్పెషాలిటీ వైద్యం, ఖరీదైన శస్త్ర చికిత్సలు పేదలకు అందే అవకాశం ఉండదు.
– బుద్ధ గౌతమి, ఇంటర్ విద్యార్థిని (ఎంపీహెచ్‌డబ్ల్యూ) కశింకోట



కశింకోట/కోటవురట్ల:

వైద్య కలను చిదిమేస్తున్నారు..



కూటమి ప్రభుత్వం నిర్ణయాలతో విద్యార్థుల్లో డాక్టరు కావాలనే ఆశలు చచ్చిపోతున్నాయి. గత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు బంగారు భవితను ఇవ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇంటర్ బైపీసీ చదువుతున్న మా అబ్బాయి టి.ఎల్.ఎస్.శ్రీరామ్‌కు డాక్టరు కావాలన్నది కల. – టి.రామసత్యనారాయణ, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

అగమ్యగోచరంగా స్టీల్‌ప్లాంట్ భవితవ్యం



- ఒక ఫర్నేస్‌తో కనిష్ట ఉత్పత్తి
- సెయిల్‌లో విలీనంతోనే పరిష్కారం

ఉక్కునగరం: రాష్ట్రంలోని అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్ ఆందోళనకరంగా మారింది. ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో, ఒక బ్లాస్ట్‌ఫర్నేస్‌తో కనిష్ట ఉత్పత్తి సాధిస్తూ సమస్యల సుడిగుండలో చిక్కుకుంది. ఇప్పుడు ఉన్న బొగ్గు, ఐరన్ ఓర్ నిల్వలతో సింగిల్ ఫర్నేస్ తప్ప రెండు ఫర్నేస్‌లు నడిపే పరిస్థితి లేదు. సింగిల్ ఫర్నేస్‌తో నెలకు రూ. 1000 కోట్లకు మించి టర్నోవర్ సాధ్యం కాదు. తద్వారా మరిన్ని అప్పులు, ఇబ్బందులు తప్పవని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగి.. ఉన్న ఒక్క ఫర్నేస్‌లో సాంకేతిక లోపం తలెత్తితే జీరో ఉత్పత్తి ఏర్పడే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సెయిల్‌లో విలీనమే శాశ్వత పరిష్కారమని కార్మిక సంఘాల నాయకులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని విలీనం దిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నారు.

ఇటీవల కాలంలో స్టీల్‌ప్లాంట్ పరిస్థితి అత్యంత క్లిష్టదశకు చేరుకుంది. మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో ఒకటి మూడేళ్లుగా మూత పడి ఉంది. ఉన్న రెండింటిలో ఒక బ్లాస్ట్‌ఫర్నేస్‌లోనే కనిష్ట స్థాయి ఉత్పత్తి చేయాల్సిన పరిస్థితికి దిగజారడంతో ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయి. గత మూడు రోజులుగా న్యూఢిల్లీ కేంద్రంగా ఉక్కు మంత్రిత్వశాఖ విస్తృతంగా జరిపిన చర్చల్లో ఉక్కు యాజమాన్య ప్రతినిధులు రూ.12 వేల కోట్లు బెయిల్ ఔట్ ప్యాకేజీ ఇస్తే పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తామని నివేదించారు. దీనిపై ఉక్కు మంత్రిత్వశాఖ అధికారులు అంతసాయం చేయలేమని, రూ.3,100 కోట్లు ఇవ్వగలమని, దానికి సంబంధించి ప్రణాళిక ఇవ్వాల్సిందిగా సూచించారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ వర్గాలు కసరత్తు చేస్తున్నాయి. ఉక్కు మంత్రిత్వశాఖ ఇస్తామన్న ప్యాకేజీ రూ.3,100 కోట్లు ముడి సరకులు కొనుగోలుకు ఉపయోగపడటం తప్ప ఇప్పటి వరకు ఉన్న బకాయిలు చెల్లించడానికి సరిపోయే పరిస్థితిలేదు. ఒకవేళ ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుమతితో ఆ ప్యాకేజీ ఇచ్చినప్పటికీ స్టీల్‌ప్లాంట్ సింగిల్ ఫర్నేస్ నిర్వహణకు తప్ప ఎటువంటి ప్రయోజనం లేదని ఉక్కు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

నోరు మెదపని చంద్రబాబు, పవన్

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్.. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను పట్టించుకోలేదని, తాము అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా ఆపడంతో పాటు సెయిల్‌లో విలీనం చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేలను ప్రజలు అత్యంత మెజార్టీతో గెలిపించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఉక్కు అఖిలపక్ష నాయకులను అమరావతికి తీసుకెళ్లి సీఎం చంద్రబాబుతో సమావేశం ఏర్పాటు చేయించారు. 'మీరు పని చేయండి.. నేను చూసుకుంటాను'అని చంద్రబాబు చెప్పడం తప్ప.. ఆ దిశగా ఎటువంటి చర్యలు కనిపించలేదు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రధాని మోదీని చంద్రబాబు కలిసినప్పటికీ స్టీల్‌ప్లాంట్ అంశాన్ని లేవనెత్తకపోవడం పట్ల ఉక్కు వర్గాలు విస్మయం చెందాయి. విశాఖ ఎంపీ భరత్‌ను కలిసి స్టీల్‌ప్లాంట్ పరిస్థితిని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వివరించారు. అతను కూడా కేంద్ర మంత్రి కుమారస్వామితో మాట్లాడి ఒత్తిడి తెచ్చిన దాఖలాలు లేవు. కొత్త ప్రభుత్వం కొలువైన తర్వాత స్టీల్‌ప్లాంట్ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి 45 రోజులు సమయం ఇస్తే కచ్చితంగా మంచి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీకీ అతీగతి లేదు. గత వారం ఉక్కు అధికారుల సంఘం నాయకులు కేంద్ర ఉక్కు కార్యదర్శి సందీప్‌ను కలిసి సెయిల్‌లో విలీనం అంశంపై మాట్లాడారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒత్తిడి వస్తే తప్ప పరిస్థితిలో మార్పు ఉండదని తేల్చి చెప్పినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణం జోక్యం చేసుకోవాలని కార్మిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇప్పించడంతో పాటు సెయిల్‌లో విలీనం చేసేలా ఒత్తిడి తేవాలని కోరుతున్నారు.

విస్తరణ అప్పులు, వడ్డీ పదేళ్లు వాయిదా వేయాలి



స్టీల్‌ప్లాంట్ విస్తరణకు చేసిన అప్పులు, దానిపై వడ్డీ భారం వల్ల స్టీల్‌ప్లాంట్‌కు ఈ పరిస్థితి తలెత్తింది. దేశంలోని ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఇచ్చినట్టే విస్తరణ అప్పులు, వడ్డీలను మాఫీ చేయడం లేదా కనీసం పదేళ్లపాటు వాయిదా వేయాలి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆర్థిక భారం తొలగించాలి. సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా భవిష్యత్‌లో ముడిసరకు కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. –డి.ఆదినారాయణ, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి, స్టీల్‌ప్లాంట్

ప్రభుత్వ రంగం కోసమే భూములిచ్చారు



రాష్ట్రంలోని అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ రంగ సంస్థ కోసమే నిర్వాసితులు తమ భూములు, ఇళ్లు ఇచ్చారు. వారి పునరావాసం, ఉపాధి చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేసే హక్కు కేంద్రానికి లేదు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్యాకేజీతో పాటు సెయిల్‌లో విలీనం చేసేలా చూడాలి.
– మంత్రి రాజశేఖర్, ఐఎన్‌టీయుసి ప్రధానకార్యదర్శి, స్టీల్‌ప్లాంట్

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం ముఖ్య కర్తవ్యం



స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కర్తవ్యం. కేంద్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆధారపడి ఉందనే విషయం అందరికీ తెలిసిందే. ఆయన మాట చెబితే ఆగుతుంది. 1,310 రోజులుగా ఉద్యమం జరుగుతోంది. ఇతర స్టీల్‌ప్లాంట్ల కంటే ఎక్కువ ల్యాండ్ బ్యాంక్ ఉండటం వల్లే అందరి కళ్లు ఈ ప్లాంట్‌పై పడ్డాయి. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే ప్రయత్నం చేయాలి. – జె.అయోధ్యరామ్, గౌరవాధ్యక్షులు, స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ

వరి పొలాల్లో నీటిని తొలగించాలి

- తెగుళ్లు సోకకుండా సకాలంలో మందులు పిచికారీ

అనకాపల్లి: రైతుల ముదురు నారు నాటాల్సి వస్తే రాగల వర్షాలను ఉపయోగించుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కుదుళ్ల సంఖ్య పెంచి కుదురుకు 4, 5 మొక్కల చొప్పున నాట్లు వేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్ పి.కె.వి.జగన్నాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముదురు నారు వేసినప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం పెంచి రెండు దఫాలుగా 70 శాతం అనగా 60 కిలోల యూరియా, నాటేటప్పుడు మిగతా 30 శాతం అనగా 25 కిలోల యూరియా అంకురం దశలోనూ వేసుకోవాలని సూచించారు. వరిపైరు నాటిన వెంటనే లేదా పిలకల దశలోనైన ముంపునకు గురైనట్లయితే, వర్షాల అనంతరం నీరు బయటికి తీసివేసి పైరు కోలుకోవడానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువు వేసుకోవాలన్నారు. తెగుళ్ల వ్యాప్తి చెందకుండా 2 గ్రాముల కార్బెండజిం, మంకోజెబ్ ముందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిపైరులో జింకులోపం కనిపించే అవకాశం ఉందన్నారు. నివారణకు 2 గ్రాముల జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో అగ్గి తెగులు, గోధుమ రంగు మచ్చ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున ఐసప్రోతయోలేన్ 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ముంపునకు గురైన వరి పొలంలో ఆకు చుట్టు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున, అధిక నీరును బయటకి తీసివేసి లీటరు నీటికి 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 2.5 మి.లీ.ల క్లోరిపైరిఫాస్‌ను పిచికారీ చేయాలని చెప్పారు.

సింహగిరిపై పవిత్రోత్సవాలకు అంకురార్పణ

సింహాచలం: సింహగిరిపై పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి అంకురార్పణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహగిరిపై పుట్టబంగారు మండపంలో నిర్వహించాల్సిన ఈ పూజలను వర్షం కారణంగా ఆలయ కల్యాణ మండపంలో నిర్వహించారు. తొలుత రుత్విక్ వరణం, ఉత్సవాంగీకారం జరిపారు. అనంతరం ఆలయం నుంచి చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి వేదికపై అధిష్టింపజేశారు. పుట్టమన్నుని స్వామి వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం మృత్యం గ్రహణం, యాగశాల ప్రవేశం, యాగశాలార్చన చేపట్టా రు. తర్వాత మన్నుని పాలికల్లో వేసి పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. శనివారం ఉదయం పవిత్రా దివాసం, తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.

ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలి

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం : గబ్బాడ ఇసుక రీచ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. యార్డులో ఉచిత ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలకు పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. విచారణ పేరుతో యార్డును తెరవకుండా కాలయాపన చేయడం అధికారులకు తగదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నర్సీపట్నం పరిసర ప్రాంతం ప్రజలకు ఇసుకను అందించాలన్నారు. నిర్మాణదారులకు ఇసుక అందుబాటులో ఉండేలా విధి విధానాలను రూపొందించాలన్నారు. ఇసుక ఉన్నప్పటికీ పంపిణీ చేయకపోవటం వల్ల భవన నిర్మాణ కార్మికులు పనులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి యార్డును తెరిచి ఇసుకను పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ కోరారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కోటవురట్ల: తాగునీటి కష్టాలతో మహిళలు విసిగిపోయారు. పది రోజులైనా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహంతో ఊగిపోయారు. సమస్య పరిష్కరిస్తారా లేదంటే ఉద్యమం చేయమంటారా అంటూ ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. సంతబయలులో పది రోజులుగా మంచినీరు అందక స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దాంతో శుక్రవారం పెద్ద సంఖ్యలో మహిళలు ఖాళీ బిందెలు చేతబట్టి నిరసన తెలిపారు. మూకుమ్మడిగా సచివాలయానికి చేరుకుని ఆందోళన తెలిపారు. సమస్య పరిష్కరించకపోతే సచివాలయం ముందు దీక్ష చేస్తామని హెచ్చరించారు. వాస్తవంగా ఇక్కడ లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత నీటి పథకం నుంచి కుళాయి ద్వారా నీరు సరఫరా అవుతుండేది. సమీపంలోని వరాహనదిలో మోటార్ల ద్వారా ట్యాంకులోకి తాగునీరు పంపింగ్ అవుతోంది. కొద్ది రోజులుగా వరాహనదిలో వరద ఉధృతి ఉండడంతో ట్యాంకుకు సరఫరా అవుతున్న పైపులైన్లు కొట్టుకుపోయాయి. దాంతో ట్యాంకులోకి నీళ్లు రాకపోవడంతో కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. తరచూ ఇదే సమస్య ఉత్పన్నమవుతున్నా, అధికారులు శాశ్వత పరిష్కారం చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సచివాలయంలో ఫిర్యాదు చేశామని, సమాధానం చెప్పడంలేదని వాపోతున్నారు. ప్రత్యామ్నాయం వెతికి తాగునీరు సరఫరా చేయాల్సిన అధికారులు తమకేం పట్టనట్టు మిన్నకుండిపోయారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతపై విచారణ



గ్రామస్తులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం పాఠశాలలో విద్యార్థులకు మాడిన మధ్యాహ్న భోజనం పెట్టడంపై జిల్లా అధికారులు కదిలారు. 'ఈ భోజనం తినేదెలా?'శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్, డీఈవో స్పందించి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు యలమంచిలి డిప్యూటీ డీఈవో, ఎస్.రాయవరం ఎంఈవో–1 పి.అప్పారావు శుక్రవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సర్పంచ్ మైలపల్లి శ్రీనివాస్, తల్లిదండ్రుల కమిటీతో సమావేశమయ్యారు. నిత్యం భోజనాన్ని తనిఖీ చేయాలని హెచ్ఎంను ఆదేశించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులది మొదటి తప్పుగా భావించి, మరోమారు ఇలా పునరావృతమైతే తొలగిస్తామని రాత పూర్వక నివేదిక తీసుకున్నారు.

17 నుంచి అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ భారత్

మహారాణిపేట: ఈ నెల 17 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు అన్ని ఎండోమెంటు దేవాలయాల్లో, ధర్మసత్రాల్లో మొక్కలు నాటడం, పరిసరాల శుభ్రత కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయశాఖ ఉప కమిషనర్లు (డీసీ),జిల్లా సహాయ కమిషనర్లు (ఏసీ)లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ మాట్లాడారు. టర్నర్ సత్రం ఉన్న డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో దేవదాయశాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రణాళిక తయారు చేశామన్నారు. దేవాలయాలకు వచ్చే భక్తులను భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అనకాపల్లి జిల్లా దేవదాయశాఖ అధికారి రాజారావు, సీనియర్ అసిస్టెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్ పేరిట మోసం

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఖాతాలో రూ.5.68 లక్షల చోరీ

అనకాపల్లి: ఆన్‌లైన్ గేమ్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. అతని ఖాతా నుంచి దఫదఫాలుగా రూ.5.68 లక్షలు తస్కరించారు. దీంతో మోసపోయినట్లు గ్రహించి బాధితుడు పట్టణ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ జి.వి.విజయకుమార్ వివరాల మేరకు... మండలంలో తుమ్మపాల గ్రామానికి చెందిన గరికిపాటి వెంకట నాగసతీష్ చెన్నైలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత మే 15వ తేదీన ఇంటి వద్ద ఉండగా, ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతడి మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి తాను విధులు నిర్వహిస్తున్న కంపెనీ వివరాలు నమోదు చేసి రిప్లై ఇచ్చాడు. తర్వాత రూ.10 వేలు ఆన్‌లైన్లో పంపించగా, తిరిగి తన బ్యాంక్ ఖాతాలో రూ.4,499 జమయ్యాయి. మే 17 నుంచి 22వ తేదీ వరకూ దఫదఫాలుగా రూ.5 లక్షల 68 వేలు ఆన్‌లైన్ గేమ్‌లో పోగొట్టుకున్నాడు. దాంతో మోసపోయినట్టు గుర్తించి అదే నెల 22న 1930కి ఆన్‌లైన్లో ఫిర్యాదు చేయగా, వెంటనే ఖాతాలో రూ.1.19 లక్షలు తిరిగి జమ అయింది. నేటికీ మిగిలిన నగదు రాకపోవడంతో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సీఐ చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీకాకుళం రోడ్-సికింద్రాబాద్ మధ్య స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్–శ్రీకాకుళం రోడ్–సికింద్రాబాద్ మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–శ్రీకాకుళం రోడ్(07487) ఏసీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం సికింద్రాబాద్‌లో రాత్రి 7.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.10 గంటలకు దువ్వాడ చేరుకుని, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీకాకుళం రోడ్ వెళ్తుంది. ఈ స్పెషల్ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు నడుస్తుంది. శ్రీకాకుళం రోడ్–సికింద్రాబాద్(07488) ఏసీ స్పెషల్ శ్రీకాకుళం రోడ్‌లో ప్రతి గురువారం సాయంత్రం 5 గంటలకు బయలుదేరి రాత్రి 7.33 గంటలకు దువ్వాడ, మరుసటిరోజు ఉదయం 9.50గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది. ఈ స్పెషల్ అక్టోబరు 3 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు నడుస్తుంది.

బీజేపీ సభ్యత్వ నమోదు విస్తృతం చేయాలి

- కర్ణాటక అసెంబ్లీ ప్రతిపక్ష నేత అశోక్



మాట్లాడుతున్న అశోక్

అనకాపల్లి: బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని విస్తృతం చేయాలని అఖిల భారత సభ్యత్వ సహ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, కర్ణాటక అసెంబ్లీ ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ తెలిపారు. స్థానిక జాతీయ రహదారి వద్ద ఎంపీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదుపై ఆయన సమీక్షించారు. గ్రామీణ స్థాయి నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లక్ష్య సాధన దిశగా చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో దశాబ్ద కాలంగా బ్రహ్మాండమైన అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతుందన్నారు. మరో మూడు దశాబ్దాలు బీజేపీ అధికారంలో ఉండడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కోలాపూర్ మాజీ ఎంపీ మునిస్వామి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పి.వి. మాధవ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు దేవానంద, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి కె.సురేంద్ర మోహన్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైవాడలో 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



వరదనీటితో నిండుకుండలా రైవాడ జలాశయం

దేవరాపల్లి: రైవాడ జలాశయంలోకి వరద ఉధృతి కొనసాగుతోంది. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో ప్రస్తుతం జలాశయంలోకి 700 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 112.30 మీటర్లకు చేరుకుంది. జలాశయం ప్రమాద స్థాయి నీటిమట్టం 113.50 కు చేరువలో ఉండటంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. జలాశయం ఎగువ భాగంలో ఏమాత్రం వర్షం కురిసి వరదనీరు పోటెత్తినా ఏ క్షణంలోనైనా స్పిల్వే గేట్లు ఎత్తి శారదా నదిలోకి విడుదల చేయాల్సి ఉంటుందని ఇరిగేషన్ డీఈఈ జి. సత్యంనాయుడు తెలిపారు. శారదానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

క్లుప్తంగా

వ్యాస రచనలో విద్యార్థినికి తృతీయ స్థానం

అనకాపల్లి: విశాఖ రామకృష్ణా మిషన్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ ఎస్సే రైటింగ్ (వ్యాస రచన) పోటీల్లో బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థిని సారిపల్లి హేమ తృతీయ స్థానం సాధించింది. రామకృష్ణ మిషన్ యాజమాన్యం విద్యార్థినికి రూ.2 వేలతోపాటు విలువైన పుస్తకాలను అందజేసింది. శుక్రవారం స్థానిక గవరపాలెం ఆదినారాయణ మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో ఆమెను ప్రిన్సిపాల్ జి.సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి: గవరపాలెం ముత్రాస్ కాలనీకి చెందిన ఎం.గణేష్ నుంచి 10 మద్యం క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ హెచ్‌సీ రామకృష్ణ శుక్రవారం చెప్పారు. ముత్రాస్ కాలనీలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఎం.గణేష్ మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటు




సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భద్రం

అనకాపల్లి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటని సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎస్.భద్రం అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి అనేక ఉద్యమాల్లో పాల్గొని, నిరంతరం బడుగు, బలహీన వర్గాల సమస్యపై పోరాటాలు చేసిన మహనీయుడన్నారు. నేటి యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మత్తూర్తి సూరిబాబు, ముక్కామల చిన్ని, దొడ్డి సూర్యారావు, కొమ్మనాపల్లి వెంకటరమణ, గ్రంధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా సింహవల్లీ తాయారు తిరువీధి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారుకి శుక్రవారం సాయంత్రం విశేషంగా తిరువీధి నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో అధిష్ఠింపజేసి, ఆలయ బేడా మండపంలో తిరువీధి జరిపారు. విశేషంగా హారతులు అందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 158 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	3,700	4,280
మూడోరకం	3,300	3,300

అనకాపల్లి సినిమాలు

35..చిన్నకథకాదు	: రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్	: సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్తిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
ఉత్సవం	: వెంకటేశ్వర
కళింగ	: శ్రీసత్య
భలేఉన్నాడే	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 93 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-19 యూనిట్లు, బీ పాజిటివ్-33 యూనిట్లు, ఓ పాజిటివ్-32 యూనిట్లు, ఏబీ పాజిటివ్-9 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 386 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 342 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

రోడ్డు ధ్వంసం.. ఒళ్లు హూనం

అసలే గోతులు రోడ్డు... ఆపై క్వారీల లారీల రాకపోకలతో మరింత ధ్వంసమవుతోంది. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ చూసీచూడనట్లు వదిలేయడంతో మూడు గ్రామాల ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రస్తుత వర్షాలతో గోతుల్లో నీరు చేరి ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది మార్టూరు రోడ్డు దుస్థితి.



రోడ్డుపై గోతుల్లోంచి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు



ఓవర్ లోడ్‌తో ఖనిజాన్ని తరలిస్తున్న ట్రక్కులు



బురదమయంగా మార్టూరు రోడ్డు

- ప్రమాదకరంగా మార్టూరు రహదారి
- ఓవర్ లోడ్‌లతోనే గోతులు
- నిత్యం వందల సంఖ్యలో క్వారీ లారీల రాకపోకలు
- మూడు గ్రామాల ప్రజలకు తీవ్ర అవస్థలు

తుమ్మపాల: మండలంలో మార్టూరు తారురోడ్డు గోతులమయంగా మారింది. గ్రామంలో అధికంగా క్వారీలు, క్రషర్లతోపాటు 5 వేల వరకు జనాభా ఉంది. ఇక్కడ అత్యధికంగా వ్యవసాయం, కూలీ పనులతోనే జీవనం సాగిస్తున్నారు. గ్రామ కొండల్లో లభించే ఖనిజాన్ని తవ్వి క్రషర్ చేసి ఇతర ప్రాంతాలకు రోజు వందల సంఖ్యలో భారీ ట్రక్కుల ద్వారా తరలిస్తుంటారు. క్వారీ, క్రషర్ల నుంచి రాళ్లు, పిక్క, క్రషర్ తరలిస్తుండటంతో మార్టూరు రోడ్డు ఛిద్రంగా మారింది. అనకాపల్లి -చోడవరం రోడ్డుకు చేరాలంటే గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల మేర ప్రయాణించాలి. భారీ లారీలు, అందులోను ఓవర్‌లోడ్‌తో రాకపోకలు చేయడంతో రోడ్డంతా అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గుంతలు, వాటిలో వర్షపు నీరు చేరి తటాకాలను తలపిస్తోంది. ప్రజలు రాకపోకలు చేయలేక నరక యాతన అనుభవిస్తున్నారు.

తరచుగా ప్రమాదాలు

నిత్యం వందల సంఖ్యలో ప్రయాణించే మార్టూరు రోడ్డు మీదుగా గ్రామస్తులతో పాటు మాకవరం, పెదమాకవరంతో పాటు పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం గ్రామాల ప్రజలు అనకాపల్లి పట్టణానికి ఉదయం నుంచి రాత్రి వరకు రాకపోకలు చేస్తుంటారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఎక్కువగా తిరుగుతాయి. వారంతా రోడ్డుపై ప్రయాణించాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ఒళ్లు హూనమవుతుందని వాపోతున్నారు. అనకాపల్లి పట్టణానికి రావాలంటే మరో మార్గం లేక, ఉన్న రోడ్డుపై వెళ్లలేక క్వారీ లారీలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గాయాలతో ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారడంతో జారిపడుతున్నారు.

ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ...

గ్రామాలతో పాటు క్వారీ, క్రషర్లకు ఒక్కటే రోడ్డు కావడంతో రోజూ రేయింబవళ్లు తేడా లేకుండా వందల సంఖ్యలో తిరుగుతున్న ట్రక్కులు పరిమితికి మించి రాయి, పిక్క, క్రషర్‌తో విపరీతమైన వేగంతో మార్టూరు మీదుగా రాకపోకలు చేస్తున్నాయి. వర్షాలు, ఎండల తీవ్రత ఉన్నప్పుడు ప్రజలు రాకపోకలు మానుకుంటున్నారు గాని క్వారీ లారీలు మాత్రం విరామం ఇవ్వడం లేదు. దాదాపు 15 క్వారీల్లో 30కి పైగా లీజుదారులు సహజ వనరుల్ని దోచుకోవడమే లక్ష్యంగా మార్టూరు కొండపై ఖనిజాన్ని తరలించేస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజల బాగోగులతో సంబంధం లేకుండా నాయకులు, అధికారుల చేతులు తడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రజల తిరుగుబాటును అధికారంతో పాటు గ్రామాల్లో ఒక వర్గాన్ని తమ వైపు పెట్టుకుని అణిచివేస్తున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు



మార్టూరు గ్రామానికి ఒక్కటే రహదారి. గ్రామస్తులతో పాటు మరో రెండు గ్రామాల ప్రజలు మార్టూరు రోడ్డు మీదుగానే అనకాపల్లి పట్టణానికి, ఇతర అవసరాల కోసం ప్రయాణిస్తున్నారు. ఇటీవల కాలంలో క్వారీ లారీలు ఓవర్ లోడ్‌తో రాకపోకలు చేయడంతో రోడ్డంతా ఛిద్రమైపోయింది. గోతుల్లో నీరు చేరడంతో ప్రజల రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. లారీల్లో ఓవర్‌లోడ్‌పై మైన్స్, ఆర్టీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. చర్యలు తీసుకోవాలని ఆర్టీవోను కోరితే మాపై దురుసుగా సమాధానం ఇస్తున్నారు. నెలవారీ మామూళ్లు కట్టి తిరుగుతున్నామని లారీ డ్రైవర్లు చెబుతున్నారు. – కరణం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, మార్టూరు గ్రామం

క్వారీ లారీలు రాకుండా చర్యలు చేపట్టాలి



క్వారీలు, క్రషర్లలో గ్రామస్తులే అధికంగా ఉపాధి పొందుతున్నారు. సమస్యలు ఉన్నప్పటికీ ఉపాధికి ఇబ్బందులు ఉంటాయన్న కారణంతో చూసీచూడనట్లు ఉండాల్సి వస్తోంది. క్వారీ లారీలు ఓవర్‌లోడ్‌తో రాకపోకలు చేయడంతో రోడ్డంతా ధ్వంసమైంది. మైన్స్ వాహనాలకు క్వారీల మీదుగా మరో రోడ్డు ఉంది. కాని కొన్ని నెలలుగా గ్రామాన్ని ఆనుకుని ప్రజలు రాకపోకలు చేసే రోడ్డు మీదుగానే లారీలు తిరుగుతున్నాయి. పగటి పూట కన్నా రాత్రిళ్లు ఎక్కువ సంఖ్యలో వేగంగా వెళ్లడంతో రోడ్డుపై గోతులు ఏర్పడి ప్రజల ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కరణం సన్యాసినాయుడు, మార్టూరు గ్రామం

వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జిగా కె.ఎం.నాయుడు



మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి: పార్టీ కష్టకాలంలో అండగా ఉన్న ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, అనకాపల్లి 80వ వార్డు ఇన్‌చార్జిగా కె.ఎం.నాయుడ్ని నియమించామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో బొడ్డేడ మాట్లాడారు. పార్టీలో నీతి నిజాయితీ, నిబద్ధతతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని మండలాల్లో పర్యటించి, కార్యకర్తలు, ప్రజలు సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ నాయకులు వేగి త్రినాథ్, నర్సింగరావు, బుద్ద రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి పైడితలమ్మ మండల దీక్ష



పైడితలమ్మ దీక్షాపీఠం రథోత్సవం

అనకాపల్లి: విజయనగరం పైడితలమ్మ మండల దీక్ష ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు పైడిమాంబ దీక్షా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.సూర్య తెలిపారు. పైడితలమ్మ మండల దీక్ష రథయాత్ర శుక్రవారం స్థానిక సుంకర మెట్ట జంక్షన్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న అమ్మవారి ఆలయం వద్ద పందిరిరాట, తోలేళ్ల ఉత్సవం, 15న సిరు మహోత్సవం, అక్టోబర్ 22న పెద్ద చెరువులో తెప్పోత్సవం, 29న ఉయ్యాల కంబాల ఉత్సవం, 30న చండీహోమం, పూర్ణాహుతి దీక్ష విరమణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపం



ఏడీ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణీంద్రకుమార్ తెలిపారు. డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమాదేవికి శుక్రవారం వారు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం లేకపోవడంతో అనారోగ్యం బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపించిందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజులు నిల్వ ఆహారాన్ని పిల్లలకు పెట్టడం వల్ల ఫుడ్‌పాయిజన్ వంటి సమస్యల వస్తున్నాయన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యపై 27న సమ్మె



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

అనకాపల్లి: దేశ వ్యాప్తంగా యూనియన్ బ్యాంకు ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 27న సమ్మె చేస్తామని ఏపీ యూనియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ జోనల్ సహాయ కార్యదర్శి కాండ్రేగుల హరికృష్ణ తెలిపారు. శుక్రవారం తుమ్మపాల యూనియన్ బ్యాంకు ఆవరణలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంతో 20 అంశాలతో కూడిన చర్చలు విఫలమవడంతో సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు రమేష్, నానాజీ, శ్రీదేవి, రోజాశ్రీ ఆదారి రాము మాలతి పాల్గొన్నారు.

టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు వెంకటలక్ష్మి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వెంకటలక్ష్మితో హెచ్‌ఎం తిరుపతిరావు, తదితరులు

సబ్బవరం: జిల్లా స్థాయి టెన్నీకాయిట్ పోటీలలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.వెంకటలక్ష్మి విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. విశాఖ జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్వర్యంలో లంకెలపాలెంలో జరిగిన ఈ పోటీల్లో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వెంకటలక్ష్మి విజేతగా నిలిచిందన్నారు. దీంతో ఈ నెల 14 నుంచి 16 వరకు శ్రీకాకుళం జిల్లా పలాసలోని వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థిని హెచ్‌ఎంతోపాటు, స్కూల్ కమిటీ చైర్మెన్ శంకరరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పద్య పఠన పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ



విద్యార్థికి జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందిస్తున్న ఆర్జేడీ విజయభాస్కరరావు

సబ్బవరం:ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి తెలుగు పద్య పఠన పోటీల్లో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి కె.పూర్ణబాబు ప్రథమ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం -2024ను పురస్కరించుకుని భీమిలి డైట్ కళాశాల అధ్వర్యంలో ఉమ్మడి విశాఖ పరిధి 9వ తరగతి విద్యార్థులకు కళాశాలలో శుక్రవారం పద్య పఠన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థికి కార్యక్రమ ముఖ్య అతిథి పాఠశాల విద్య ఆర్జేడీ విజయభాస్కర్ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన పూర్ణబాబుతోపాటు గైడ్ టీచర్ రఘురామనాయుడుని ఆర్జేడీ, ప్రిన్సిపాల్, సహచర అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో తెలుగు టీచర్ ఐసాక్, వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, సిబ్బంది రాంబాబు, చిరంజీవిరావు, తిరుపతి రావు, జానకిరామ్, సాయిరాం, లక్ష్మణరావు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెం.. గంగపుత్రుల వ్యథ!

- శిథిలావస్థకు చేరిన సామాజిక భవనం, డ్రై ఫిష్ ప్లాట్‌ఫాంలు
- మత్స్యకారుల వలలు, ఇంజిన్లు దాచుకునే వీల్లేని వైనం
- ఎండు చేపలు ఆరబెట్టేందుకూ తప్పని తిప్పలు

రాజుగారు–ఏడు చేపల కథ గురించి మనకందరికీ తెలుసు. ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం మత్స్యకారులది ఎండు చేపల వ్యథ. వేట సామగ్రిని దాచుకునేందుకు కనీస వసతుల్లేవనే గంగ పుత్రుల బాధ. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో నిర్మించిన సామాజిక భవనమే ఇన్నేళ్లూ వారికి ఆశ్రయం ఇచ్చింది. సింహాద్రి ఎన్టీపీసీ నిర్మించిన ప్లాట్‌ఫారాలు చిరుచేపల్ని ఎండబెట్టుకునేందుకు ఉపయోగపడేవి. సరైన నిర్వహణ లేక ఇవన్నీ శిథిలమయ్యాయి. దీంతో మత్స్యకారులకు వెతలు మొదలయ్యాయి.



రోడ్డుపై ఎండబెట్టిన చిరు చేపలు



శిథిలావస్థకు చేరిన సామాజిక భవనం



బీటలు వారిన డ్రైఫిష్ ప్లాట్‌ఫాం

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో మత్స్యకారుల కోసం 2004లో అప్పటి దివంగత మహానేత వైఎస్సార్ ప్రభుత్వం రూ.4 లక్షల వ్యయంతో సామాజిక భవనాన్ని నిర్మించింది. తీర ప్రాంతానికి అతి సమీపంలో చేపట్టిన ఈ భవనంలోనే ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం మత్స్యకారులు,, మత్స్యకార్మికులు చేపల వేటకు ఉపయోగించే వలలు, బోట్ల ఇంజిన్లు వంటి సామగ్రిని భద్రపరచుకునేవారు. ఆ తర్వాత నుంచి దీని ఆలనాపాలనా చూసేవాళ్లు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది.

శిథిల భవనంతో అవస్థలు : రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన సామాజిక భవనం నిర్వహణ బాధ్యతను అనంతర పాలకులు గాలికొదిలేశారు. ఐదు పదేళ్లకో సారైన దాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆరంభంలో మెట్ల మార్గం ద్వారా భవనం పైకి వెళ్లి చిరు చేపల్ని ఎండబెట్టుకునేవారు. ప్రస్తుతం మెట్ల మార్గం కూడా ఓ భాగం కూలిపోయింది. భవనం ముందు భాగం పూర్తిగా బీటలు వారి శిథిలమైంది. తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. గచ్చులు, శ్లాబ్ పెచ్చులుగా ఊడిపోయాయి. మరో దారిలేక ప్రస్తుతం ఆ శిథిల భవనంలోనే వలలు, ఇంజన్లను భద్రపరచుకుంటున్నారు.

ఎండు చేపలు రోడ్డు పాలు! : సముద్రంలో చిక్కిన చిరు చేపల్ని ఎండబెట్టుకోవడానికి వీలుగా సామాజిక భవనం సమీపంలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో పదేళ్ల క్రితం మూడు ప్లాట్‌ఫాంలను నిర్మించింది. ఇవి కూడా నిర్లక్ష్యపు నీడలో శిథిలావస్థకు చేరాయి. చాలా చోట్ల బీటలువారాయి. ప్లాట్ ఫాంల ఫ్లోరింగ్ పాడవడంతో ఏ మాత్రం వర్షం వచ్చినా నీరు నిలిచిపోతోంది. చేపల్ని ఎండబెట్టడానికి వీల్లేకుండా పోతోంది. దీంతో చేసేది లేక ఇసుక తిన్నెలపై వలలు పరిచి, చిరు చేపలను ఎండబెడుతున్నారు. కొంత మంది మత్స్యకారులు రోడ్లపైనే ఎండబెట్టుకుంటున్నారు. చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని గంగ పుత్రులు వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాం. వేట సామగ్రిని భద్రపరచుకోవడానికి నిర్మించిన సామాజిక భవనం దాదాపు శిథిలావస్థకు చేరింది. సామగ్రిని భద్రపర్చుకోవడానికి ఇబ్బందులు తప్పట్లేదు. భవనం గచ్చులు పాడయ్యాయి. తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. సామాజిక భవనం ఎదురుగా ఉన్న ప్లాట్ ఫామ్ బీటలు వారి గచ్చులు పూర్తిగా పాడయ్యాయి. తక్షణం మరమ్మతులు చేపట్టాలి.

– సూరాడ తాతాజీ, ముత్యాలమ్మపాలెం

ఎండు చేపలకు రోడ్డే ఆధారం



సముద్రంలో చిక్కిన చిరు చేపల్ని కొనుగోలు చేసి, ఎండబెట్టి గ్రామీణ ప్రాంతాల్లో విక్రయిస్తాను. స్థానికంగా లభ్యమైన పచ్చి చిరుచేపలను ఎండబెట్టేందుకు గ్రామంలో సరైన వసతి లేక రోడ్లపై వేయాల్సి వస్తోంది. తీరంలో ప్లాట్ ఫారాలు ఉన్నప్పటికీ బాగా పాడైపోయాయి. చిన్నపాటి వర్షం వచ్చినా గుంతల్లో నీరు చేరి రోజుల తరబడి అలానే ఉంటున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

– అరిజిల్లి బంగారమ్మ, చిరు చేపల వ్యాపారి

ప్రభుత్వానికి నివేదించాం



తీరంలో మత్స్యకారుల సౌకర్యార్థం నిర్మించిన సామాజిక భవనం, ప్లాట్ ఫారాల శిథిలావస్థకు చేరిన విషయం మా దృష్టికి కూడా వచ్చింది. మరమ్మతుల విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు కూడా తెలియజేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపడతాం. ప్రత్యామ్నాయాలపైనే ఆలోచిస్తున్నాం.

– హేమసుందరరావు, ఎంపీడీవో, పరవాడ

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం నగరంలోని ఇసుకతోట ప్రాంతానికి చెందిన ఆకెళ్ల శ్రీనివాస జవహర్‌లాల్ నెహ్రూ రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందించారు. సింహగిరిపైనున్న పీఆర్వో కార్యాలయంలో దాతకు అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు బాండ్‌ని అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందజేశారు.